శ్రీ రమణ జ్యోతి
సెప్టెంబర్ 2020
ఈ సంచికలో ...

Sri Ramana Jyothi
September 2020
IN THIS ISSUE ...

1. డా॥ కే.యస్. గారి 74వ ప్రవచనం — డా॥ వి. రామదాస్ మూర్తి 3
2. శ్రీ భగవాన్ సేవలో — జి. శ్రీహరిరావు 10
3. శ్రీరమణమహర్షి భక్తాగ్రేసరులు — మల్లాది ఫణిమాల 24
4. శ్రీరమణమహర్షి సూక్తులు — కమలాకర వేంకటరావు 25
5. శ్రీరమణ మానసము — బిరుదవోలు లక్ష్మమ్మ 18
6. Inside the Jaws of the Tiger — Dr. K. Subrahmanian 30
7. Kavyakantha's Chatvarimsat — V. Krithivasan 42
8. Motherly Love — G. Sri Hari Rao 45
9. Prapatti Astakam — V. Krithivasan & Sneha Choudhury 46
10. Pundit and Peasant — Prof. K. Swaminathan 49

**Events in Sri Ramana Kendram in September 2020**

1. Satsang - Every Sunday - 9.00 - 10.45 a.m.
2. 3rd Sunday - Meditation - 9.00 - 10.45 a.m.
3. 12th September (Every 2nd Saturday of the month) Uma Sahasram recitation from 12.00 noon - 5.00 p.m.
4. 1st September - Bhagavan's Advent Day.
5. 13th September - Punarvasu Satsang - 6.00 - 7.00 p.m.

(Devotees may please note that due to Social distancing, satsangs are being held online. For details please contact Kendram Office)

© Copyrights of all the material used from Sri Ramanasramam publications in Sri Ramana Jyothi either in excerpted form, translated form or serialised form totally belong to Sri Ramanasramam, Tiruvannamalai.

**శ్రీ రమణజ్యోతి వ్యవస్థాపకులు: కీ॥శే॥ డా॥ కె. సుబ్రహ్మణియన్**
**(వ్యవస్థాపక అధ్యక్షులు, శ్రీరమణకేంద్రం)**

# జ్ఞాని యొక్క ప్రవర్తన

డా॥ కే.యస్. గారి 74వ ప్రవచనం
అనువాదం: డా. వి. రామదాస్ మూర్తి

## నిరంతర ప్రయత్నం

నేను పద్నాలుగు సంవత్సరాల పాటు, వారం తరువాత వారం, భగవాన్ గురించి మాట్లాడి వుంటాను. నేనేమీ క్రొత్తది చెప్పలేదని, పాత విషయాలే చెబుతూ వస్తున్నాని మీకు తెలుసని నాకు తెలుసు. ఒకే విషయాన్ని గురించి వేర్వేరు వ్యక్తుల నుండి వింటుంటాము, ఎందుకంటే అది అంతు లేనిది. రామాయణం గురించిన ప్రవచనాలను మీలో కొందరు సంవత్సరాల పాటు విని వుండవచ్చు. అలాంటి ప్రవచనాలను వినడానికి మనకు విసుగు పుట్టదు. ప్రవచనం చేస్తున్న వ్యక్తి గొప్పవాడని కాదు; ఆ విషయం యొక్క గొప్పదనమే కారణం.

మనతో ఎవరైనా కొద్ది నిమిషాల పాటు మాట్లాడితేనే మనం విసిగిపోతాము. ఇక వినడానికి ఇష్టపడం. కాని ఋషులు, మహాత్ముల ప్రవచనాలను వినాలని కోరుకుంటాం. ఎందుకు అలా ఇష్టపడతాం? మనం ఎప్పటికీ ఆనందంగా వుండడానికి ఏదైనా మార్గం దొరుకుతుందేమోనని తెలుసుకునే ప్రయత్నం చేస్తాం. వేదాలు, శాస్త్రాల గురించి తెలుసుకోవాలన్న ఆసక్తి వుంటుంది. వాటివల్ల ఎన్నో విషయాలు తెలిసొస్తాయి. కాని యథార్థానికి మనం సుఖంగా వుండాలని, వీలైతే ఎప్పటికీ అలాగే వుండాలని,

కోరుకుంటాం. అది తీరుతుందేమోనని ఎంతోమందిని ఆశ్రయిస్తాం. తద్వారా కొంతకాలం సుఖం లభించినప్పటికీ, అది ఎక్కువ కాలం వుండదు. దాంతో మరొక గ్రంథం ఏదో పఠిస్తాం, లేదా మరొక గురువు చెంతకు చేరతాం, ఆయన క్రితం గురువు కంటే మెరుగైన వారన్న భ్రమతో. అంతే, మొత్తం మన జీవితకాలం అంతా, గ్రంథపఠనం లేదా వ్యక్తులను ఆశ్రయిస్తూ, శాశ్వత సుఖ, సంతోషాలను సాధించే రహస్యాన్ని గురించి తెలుసుకునే ప్రయత్నం చేస్తూనే వుంటాం.

కొందరు నీ కర్తవ్యం నీవు చేసుకుంటే చాలని, కొందరు ధ్యానం చేయమని మరికొందరు పూజ చేయమని ఇలా వివిధ సలహాలు ఇస్తారు. మనలో కొందరు ఇవన్నీ కూడ ప్రయత్నించి వుండవచ్చు. అయినప్పటికీ, కొందరికి లభించాయని చెబుతున్నవి తమకెందుకు అందుబాటులోకి రావడం లేదని ప్రశ్నించుకుంటారు. ఎందుకంటే, ఆనందమని మనం అనుకునేది మునులు, ఋషులు, భావించే దానికి భిన్నంగా వుంటుంది. మన పరిమిత మనసుతో, మన పరిమిత అనుభవంతో ఆనందం గురించి ఒక నిశ్చిత అభిప్రాయానికి వస్తాం. ఏ మినహాయింపు లేకుండ అందరమూ మనకు లభించనిది ఏది వుందో, దాని కోసం అన్వేషిస్తాం. సుఖ, సంతోషాలు కొన్ని సమయాల్లో లభిస్తూనే వుంటుంది. ఎవరికీ వారం మొత్తంలో ఎల్లప్పుడూ అదే స్థితి వుండదు. అప్పుడప్పుడు హెచ్చుతగ్గులు ఏర్పడుతూనే వుంటాయి. మనం హాయిగా వున్నప్పుడు దాన్ని అతుక్కుని అలా వుండిపోవాలని వాంఛిస్తాం, అది మానవ నైజం.



ఆ స్థితికి చేరినప్పుడు, ఇప్పుడున్న కొన్ని సమస్యలు అప్పుడు వుండ బోవని అనుకుంటాం. ఈ విషయంలోనే మనం మునులు, ఋషుల జీవితాల నుండి గ్రహించాల్సింది ఎంతో వుంది. నాకింకా చిన్న వయసప్పుడు ఈ ఆలోచన నన్ను ఎంతో బాధపెడుతుండేది.

**ఆశ్రమంలో అనుభవం**

నేను ఆశ్రమానికి వెళుతున్న రోజుల్లో, భగవాన్‌ను భోజనశాలలో చూసినా, లేదా మరొకప్పుడు ఆయన కాలకృత్యాల కోసం వెళ్ళారని తెలిసినా, భగవాన్‌కు కూడ తినడం అవసరమా, కాలకృత్యాలు తీర్చుకోవాలా అనిపించేది. ఇతరులతో మాట్లాడాలా? ఆ స్థితికి చేరిన తరువాత 'ఇతరులు' అంటూ లేరని పవిత్ర గ్రంథాలు చెబుతున్నాయి అని విన్నాను. ఉన్నది ఒకటే అయినప్పుడు, ఇక ఇంకేదో కావడం అంటూ వుండదు. మనం చేసే పనులన్నీ మరేదో అయిపోవాలని చేస్తాము. నేను సత్సంగాలలో పాల్గొనడం, మరింత మంచి వ్యక్తిగా మారాలన్న కోరిక వల్లనే. కేవలం అలా వుండడం కాదు, అలా అయిపోవాలని ఆరాటం. నిజమైన జ్ఞాని విషయంలో వారు మరేదో అయిపోవాలని అనుకోరు. వారు అలాగ వున్నారు, అంతే. వ్యక్తికి మనసు వున్నప్పుడు, దాన్ని అభివృద్ధి చేసుకుని మరేదో అయిపోవాలని అనుకుంటారు. మన మనసులాంటి మనసు లేనివారికి ఏదో అవుదామన్న ఆశ ఏ మాత్రం వుండదు. వారు ఏ రకమైన కోరిక లేని స్థితిలో వుంటారు, అందుకే వాళ్ళు ఉన్నట్లు వుంటారు కాని ఇంకేదీ అవుదామని వాంఛించరు.

నేను చిన్న వయసులో వున్నప్పుడు, భగవాన్ సమక్షంలో కూడ ఈ విషయాల గురించి ఆలోచిస్తూ వుండేవాడిని. అప్పుడప్పుడు మాట్లాడే అవసరం అసలు ఆయనకు వుందా? పలికే మాటల మాధ్యమం లేకుండ ఆయన తాను అనుకున్న విషయాలను తెలియపర్చలేరా? ఆయన మనుషులతోనే కాదు పశుపక్ష్యాదులతో కూడ మాట్లాడేవాడు. ఎప్పుడైన ఎవరికైన ఒక విషయానికి సంబంధించిన అనుమానం వస్తే, ఫలాన పుస్తకాన్ని తెమ్మనే వారు. ఆయన అలా ఎందుకు చేయాలి, తలచుకుంటే ఆ పుస్తకమే ఎగిరి ఆయన దగ్గరకు రాదా? ఇలా ఆలోచించేవాడిని. అసలు ఆయన ఆహారం తినాల్సిన అవసరం వుందా? ఎక్కడో నేను విన్నాను ఎవరో సాధువు ఐదేళ్ళపాటు, తిండి తినలేదట. మనకు అలాంటివి వింటే అలాంటి వాళ్ళపై గురి కుదురుతుంది. అది చాలా గొప్ప విషయం అనుకుంటాం. ఆ తరువాత ఆ విషయం మళ్ళీ మరుగుపడి పోతుంది. అసలు అది సాధ్యమా?

నీటి మీద నడవడం నేర్చుకున్నాను, అలా నడువగలనని ఎవరో శ్రీరామకృష్ణ పరమహంసతో చెప్పారట. దానికి ఎంతకాలం పట్టిందని అడిగితే, ఏడేళ్ళు పట్టిందన్నాడట మనకు అది గొప్పగా అనిపిస్తుంది. జవాబుగా రామకృష్ణ పరమహంస, ‘‘పాపం, ఏడేళ్ళు వృథా అయిపోయాయే! నదిని దాటడానికి పది పైసలు ఖర్చుపెడితే పని అయిపోయేది కదా?’’ అని అన్నారట. ఇది నవ్వాల్సిన విషయం కాదు, ఉదాహరణకు, ఇతరులు చూస్తుండగా నేను ఒక నిమిషంలో ముప్పై ఇడ్లీలు తిన్నానుకోండి. అందరూ మెచ్చుకుంటే సంతోషంగా



వుంటుంది. అదే మరుసటి సంవత్సరం ఇంకెవరో, ఈ రికార్డును మించారనుకోండి. దుఃఖం వస్తుంది. దానిని తిరిగి అధిగమించాలన్న పట్టుదల వస్తుంది. ఇది ఎక్కడ ఆగుతుంది? అసలు అది ఒక గొప్ప విషయమా?

## జ్ఞాని ప్రవర్తనను ఊహించలేము

భగవాన్ యొక్క అసాధారణ విషయమేమంటే, వారు ఆయా వ్యక్తికి తగినట్లు తాము ఏమి భావిస్తారో సమాధానాన్ని ఆ విధంగా చెప్పేవారు. శ్రీరామచంద్రుడు, శ్రీకృష్ణుడు, భగవాన్ శంకరాచార్యులు కూడ ఒకటే చెప్పారు. జ్ఞాని కూడ మనందరిలాగే ప్రవర్తించేవారు. రోజువారీ విషయాలలో మాత్రం సగటు వ్యక్తికి ఏ విధంగా భేదం లేనట్లు నడుచుకుంటారు. కాని నిజంగా వారు ఎంతో వేరుగా వుంటారు. మనలాగే వాళ్ళు అగుపడకపోతే మనం భయపడతాం. రెండవది, వాళ్ళు మామూలు మానవులలాంటి వారు కారు, మనం వారి మాదిరి వుండడానికి ప్రయత్నించకూడదు అన్న అభిప్రాయానికి వస్తాం. ఆలాంటి గొప్పవారు బాహ్యంగా ఆ విధంగా ప్రవర్తించడం మనపై వారి గొప్ప దయ, ప్రేమ వున్నందువల్ల మాత్రమేనని గ్రహించాలి.

నీవు జిల్లా కలెక్టర్ అయి వుండవచ్చు కాని నీ అధికారం నీ కొడుకు లేదా మనమడి మీద చూపించవు. బయటి వాళ్ళు నిన్ను చూసి భయపడతారేమోగాని, వీళ్ళు భయపడరు. కారణం వీళ్ళ మీద అధికారం లేదు. అంతేకాదు. వాళ్ళను సంతోషపెట్టడానికి నీవు చిన్న చిన్న పిచ్చిపనులు చేసేందుకు కూడ సిద్ధమౌతావు.

నాలుగైదేళ్ళ కొడుకు నిన్ను వంగమని, నీవు గాడిదవి, నేను నీ మీద స్వారీ చేస్తానంటే, నీవు అలా చేయడానికి సిద్ధపడతావు. ఆ ఆటలో చిన్నవాడు ఇంకా తొందరగా పొమ్మని నిన్ను కొట్టవచ్చు కూడ. అప్పుడు నీకేమైనా జరిగినా నీకు కోపం రాదు. పిల్లవాడి దృష్టిలో నీవు గాడిద. నీవు వాడి మీద ప్రేమతో గాడిదలాగ నటిస్తున్నావు. వాడి సంతోషం కోసం ఏమైనా చేస్తావు. అదే పక్కింటి పిల్లవాడి కోసం అలా చేయడానికి ఒప్పుకోవు. అలాంటి పని పిచ్చిదని తెలిసినప్పటికీ అందులో నీ హృదయం యొక్క పాత్ర వుంది గనుక, అది నిజం కానప్పటికి నటించడానికి ప్రేమ వల్ల వేరుగా భావించవు. వాళ్ళ సంతోషం కోసం మన అధికారం రంగంలోకి రాదు.

మన ప్రవర్తన ఇలా వుండాలా అన్న ప్రశ్న ఉదయిస్తుంది. మనం పరిమితమైన బుద్ధిని ఉపయోగించి ఆలోచిస్తాము. కాని మనలా కాకుండ అసలు మనసే లేని వాళ్ళను అవగాహన చేసుకొనడం మనకు సాధ్యపడదు. అది 'అంతే' అని మాత్రం చెప్పగలం. పొరుగు ప్రదేశానికి వెళ్ళినప్పుడు, ఇంకెవ్వరూ వద్దను కున్నప్పుడు ఎవరైనా పడుకునేందుకు ఒక గది ఇస్తే, కాస్సేపటికి ఇద్దరు ముగ్గురొచ్చి తాము కూడ అక్కడే పడుకుంటామంటే, వాళ్ళు కొత్త వాళ్ళే, ఏమి జరుగుతుందోనని ఇష్టపడము. అదే మహర్షి విషయం గమనించండి.

భగవాన్ స్కందాశ్రమంలో వుంటున్నప్పుడూ, పాత హాలుకు ఆశ్రమం మారినప్పుడు కూడ ఎందరో ఆయన చుట్టూ పడుకునే వారు. సోఫా ఆ తరువాత ఎప్పుడో అమర్చారు. అప్పటిదాకా భగవాన్



నేలమీద పడుకునేవారు. బయటికి పోవడానికి స్థలం లేదు గనుక మహర్షి చుట్టూ ఎంతోమంది పడుకునే వాళ్ళు. శరీర స్పృహ లేనప్పుడే అలాంటి ప్రవర్తన సాధ్యమతుంది. భగవాన్ జీవితం మొత్తం పరికించి చూస్తే ఒకరోజు కూడ అలాంటి బ్రతుకును గడపడం ఎంత కష్టమో మనకు బోధపడుతుంది. భగవాన్ విరూపాక్ష గుహలో, స్కందాశ్రమంలో, అరుణాచలేశ్వర దేవాలయం దరిదాపుల్లో, ఆ తరువాత రమణాశ్రమంలో గడిపారు. తిరువణ్ణామలై గిరి మీద, ముఖ్యంగా వేసవికాలంలో వుండ గలగడం ఎంత కష్టమో ఊహించవచ్చు. తిరువణ్ణామలై దక్షిణాదిలో అతి ఉష్ణ ప్రదేశాలలో ఒకటి. ఆశ్రమంలో కూడ బిగింపబడిన పంకా మహర్షి కూర్చునే చోటుకు దగ్గరిగా లేదా ఆ పై భాగంలో కాకుండ దూరంగా బిగింపబడి వుండేది. అదీ దర్శకుల సౌకర్యం కోసమే తరువాత రోజుల్లో అమర్చారు. ఇక విరూపాక్ష గుహ, స్కందాశ్రమంలో అలాంటిదేమీ లేదు. భగవాన్ ఎప్పుడూ ఈ విషయం గురించి పట్టించుకోలేదు.

## శుష్క వేదాంతం నిరుపయోగం

విద్యుత్తు సరఫరా లేకుంటే వేడిగా వున్నప్పుడు మనం కొద్ది నిమిషాల కాలంలోనే తల్లడిల్లిపోతాం. భగవాన్ విషయం దీనికి పూర్తిగా విరుద్ధం. ఆయన శరీరంతో ఎప్పుడూ మమేకం కాలేదు. ఇట్లాంటి విషయాల్లో మనం ఇతరులు ఇబ్బందిని గురించి ఫిర్యాదు చేస్తే అర్థం చేసుకోవాలి. భగవాన్ నుండి నేర్చుకొనవలసిన వాటిలో ఇదొకటి.

ఎవరైనా భగవాన్‌ను సమీపించి తమకు ఒంట్లో బాగా లేదనీ, ఎన్నో మందులు మింగుతున్నామని వాపోతే, భగవాన్ అప్పుడు శరీరం శాశ్వతం కాదు, శరీరంమీద ధ్యాస లేకుండ వుండాలి అని 'వేదాంత' బోధ చేయలేదు. వాళ్ళ పరిస్థితిని గురించి శ్రద్ధగా విని, ఎంతో దయతో సముదాయిస్తూ ఏమేమి మందులు వాడు తున్నారు? ఏదో ఆయుర్వేద మందు వున్నదన్నారు. దాన్ని ప్రయత్నించవచ్చు కదా? అంటూ సలహా ఇచ్చేవారు. కావ్యకంఠ గణపతిముని భగవాన్‌ను ఉద్దేశించి ''మీరు ఇతరుల విషయాలలలో ఎంతో జాగ్రత్తగా అన్నీ తెలుసుకుంటూ వ్యవహరిస్తారు. మరి మీ సంగతి వచ్చేసరికి ఏదీ పట్టించుకోకుండ ఊరికే వుండిపోతారు'' అని అడుగుతుండేవారు. ఒక జ్ఞానికీ, వేదాంతం చదువుకున్న వ్యక్తికీ అదే తేడా, వేదాంతి ఇతరులతో ''ఏమీ కంగారు పడవద్దు, ఈ మొత్తం ఒక 'మాయ' అని చెబుతాడు. తల్లి తానేమీ తినకపోవచ్చు, కాని చిన్నబిడ్డ ఏదైనా కావాలని అడిగితే, దాన్ని తయారు చేస్తుంది. అలాంటి కనికరం, భగవాన్, ఇతర జ్ఞానులలో కనిపిస్తుంది. (నిన్ను ఇతరులలోను ఇతరులను నీలోను దర్శించగలగాలి). ఇతరులతో ఎలా నడుచుకోవాలి? ఈ ప్రశ్నకు పూర్తిగా సంతృప్తినిచ్చే సమాధానం లేదు. ఎందుకంటే ఇది మేధస్సుకు సంబంధించిన ప్రశ్న. మనలాంటి ఒక మనసు ప్రత్యేక వ్యక్తిత్వం, శరీర స్పృహ లేనివారితో సంబంధించిన వ్యవహారం ఇది. నేను భగవాన్ అయితేగాని భగవాన్‌ను అవగాహన చేసుకోలేను. ఇది ఒక్క భగవాన్ విషయంలోనే కాదు, ఇతరులను



ఎవ్వరినైనా సరే పూర్తిగా తెలుసుకునేందుకు మనం వారయితేనే కుదురుతుంది. అలాగ నేను నీవైనప్పుడు, కనికరం తప్ప నిందించడం అంటూ వుండదు. సంపూర్ణమైన అవగాహన ఏర్పడి నందువల్ల తప్పు పట్టడం వుండదు. జ్ఞానులు ఆ స్థాయిలో వుంటారు.

భగవంతుడు మనం చేసే కర్మలను బట్టి తప్పొప్పులను నిర్ధారించడు. దేవుడు నియంత కాదు. దేవుడు ప్రేమస్వరూపి. మనం తప్పు పని చేస్తే మన అంతరాత్మ వెంటనే మనకు ఆ విషయాన్ని ఎత్తి చూపుతుంది. అదే దానికి శిక్ష. మన యొక్క ప్రవర్తన లోనే ఈ విషయం భగవంతుడు నిక్షిప్తం చేసి వుంటాడు. అందుకే దేవునికి తెలియకుండ మనం ఏమీ చేయలేము. భగవాన్, గాంధీజీ,, ఈ విషయాన్ని పదే పదే చెప్పేవారు. 'నా' కంటే కూడ నాకు దగ్గరగా దేవుడు వున్నాడని గాంధీజీ అనేవారు. దేవుని కృప వల్ల మనం ఈ రకమైన మానసిక ధోరణిని అలవర్చుకుంటే, ఎలాంటి సమస్యలూ వుండవు. సమస్యలు వుండవు అనడం కంటే, వాటి పట్ల మన ధోరణి వేరుగా వుంటుంది అనాలి. ఆ స్థితి గురుకృపతో లభిస్తుంది. అటువంటి పరిస్థితిలో ఎలాంటి సమస్యలు ఏర్పడినప్పటికి వాటిని భగవంతుని ఇచ్ఛగా అంగీకరించడం నేర్చుకుంటాం.

సంకల్ప శక్తి అంటే, కష్టాలు వచ్చినప్పుడు పరిహారానికి ఏదో ఒకటి చేయడం కాదని భగవాన్ చెప్పేవారు. మన కర్తవ్యం మనం నిర్వహించడం లాగా ప్రతి విషయాన్ని భగవదేచ్ఛగా అంగీకరించి నడుచుకొనడం నిజమైన సంకల్ప శక్తి అని మహర్షి చెప్పారు.

# శ్రీ భగవాన్ సేవలో

- జి. శ్రీహరిరావు

## కృతజ్ఞత

ఆశ్రమానికి సంబంధించిన ఇబ్బందులన్నీ 1960 నుండి ప్రారంభమైన దశాబ్దంలో తగ్గడం ప్రారంభించాయి. ఆశ్రమ శ్రేయోభిలాషులూ, స్నేహితులూ క్రమంగా పెరుగుతూ వచ్చారు. కోర్టు తగాదాలు నెమ్మదిగా తగ్గుతూ వచ్చాయి. గణేశన్ నాకు తోడుగా వుండటంతోనూ, ఇతరులు కూడా సహాయం చేయటం వల్లనూ, అన్నిటినీ మించి, బయటకు కనిపించని శ్రీభగవాన్ రక్షణ నిరంతరం కాపాడుతుండటం వల్లనూ ఆశ్రమ వ్యవహారాలను శ్రీభగవాన్ బోధించిన మార్గంలో నడపడంలో పూర్తిగా నిమగ్నం అవ్వగలిగాను. మహాభక్తులైన శ్రీ ఎస్.ఎస్.కోహెన్, మేజర్ చాడ్విక్కు, ఆస్బర్న్ దంపతులు, డా. కృష్ణస్వామి, కె.కె.నంబియార్, ఫ్రామ్‌జీ దొరాబ్జీ, కీర్తిశేషులైన మరికొందరు ఆ రోజులలో నాకు ఎంతో సహాయకారులుగా, కొండంత అండగా నిలిచారు. అంతేగాక, శ్రీ ఎ.ఆర్.నటరాజన్‌గారు, ప్రొఫెసర్ స్వామినాథన్‌గార్ల స్నేహం నాకు లభించడం నా అదృష్టం. శ్రీభగవాన్‌కు గొప్ప భక్తులైన ఈ ఇద్దరు ఆశ్రమానికి నిజమైన శ్రేయోభిలాషులు. గమ్మత్తుగా నాకు ఎపుడు ఏ ఇబ్బంది వచ్చినా, అది పెద్దదైనా లేక చిన్నదైనా వీరి సహాయం నాకు వెంటనే లభించేది. నన్నుగానీ, ఆశ్రమాన్నిగానీ ఎన్నో క్లిష్టమైన పరిస్థితులలో వీరిద్దరూ గట్టెక్కించారు. ట్రస్ట్ వ్యవహారాలలోగానీ, కోర్టు తగాదాలలోగానీ, పుస్తక ప్రచురణల



విషయాలలోగానీ, ఆదాయపు పన్ను మినహాయింపులలోగానీ, ప్రభుత్వానికి సంబంధించిన లావాదేవీలలోగానీ వీరిద్దరి సహాయం నాకు కోరగానే లభించేది. 1979-80 సంవత్సరాలలో శ్రీభగవాన్ నూరవ జన్మదిన వేడుకలు ఢిల్లీలో వైభవంగా జరగడానికి కారకులు ఈ ఇద్దరు మహాభక్తులే.

ఇంకా ఎంతోమంది స్నేహితులు నాకు కష్టసుఖాలలో అండగా నిలిచారు. వారి పేర్లు ఇక్కడ ప్రస్తావించకపోయినా, వారందరికీ నేను ఎంతో కృతజ్ఞుణ్ణి. అంతేకాదు. ఈ రోజున ఆశ్రమం ఇంత స్థాయికి అభివృద్ధి చెందిందంటే, దానికి ఆశ్రమానికి చెందిన అనేక శాఖలలో పనిచేసే వుద్యోగస్థులు, పనివారు పడిన కష్టమే కారణం. వారికి నేను కృతజ్ఞుణ్ణి అని వేరే చెప్పనవసరం లేదు. చిరకాల ఆశ్రమవాసీ, మహాభక్తుడూ అయిన శ్రీబలరామరెడ్డిగారి నైతిక అండా, విజ్ఞతతో కూడిన వారి సలహాలూ నాకు ఎంతో సహాయ కారులుగా నిలిచాయి. ఆశ్రమవాసుల నిరంతర సహకారమూ, నిష్ఠతో కూడిన పండితుల పూజా కార్యక్రమాలూ, శ్రీభగవాన్ దివ్యప్రకాశానికి తగిన వాతావరణం ఆశ్రమానికి కల్పించాయి.

గృహస్థుగా నేను నా విద్యుక్త ధర్మాలను నిర్లక్ష్యం చేయలేదు. అలా చేసుంటే కరుణాపయోనిధి శ్రీభగవాన్ హర్షించేవారు కాదు. పిల్లలందరినీ చక్కగా చదివించాను. గణేశన్ మినహా, మిగతా అందరూ ఆనందంగా గృహస్థ జీవితాలు గడుపుకుంటున్నారు. నా పిల్లలు, మనుమలు, మనుమరాళ్ళు నన్ను తమ ప్రేమతో, గౌరవంతో ముంచెత్తుతారు. శ్రీభగవాన్‌పట్ల కృతజ్ఞతతో నా

హృదయం ద్రవించిపోతుంది.

## 31. ఆశ్రమంలో అభివృద్ధి కార్యక్రమాలు

గత కొన్ని దశాబ్దాలుగా ఆశ్రమంలో జరిగిన అభివృద్ధి కార్యక్రమాల గురించి, కొత్తగా చేపట్టిన పనుల గురించి తెలిపి నా ఈ రమణాశ్రమ జీవిత స్మృతులను ముగిస్తాను.

శ్రీభగవాన్ నిర్వాణం చెందిన రోజులలోనూ, శ్రీనిరంజనానంద స్వామి దేహత్యాగం చేసినప్పటికి ఆశ్రమానికి రూ.14,000 అప్పు వుండేది. శ్రీభగవాన్ దేహం చాలించి వెళ్ళేసరికి కొంతమంది ఆశ్రమ వాసులు తిరుగుబాటు లేవదీసారు. చాలా అంతఃకలహాలు మొదలయ్యాయి. అయితే, మనస్ఫూర్తిగా భక్తులు సహాయం చేయడం వలన, అన్ని ఇబ్బందులూ నెమ్మదిగా సమసిపోయాయి. శ్రీభగవాన్ కరుణ వలన ఈనాడు ఆశ్రమ వ్యవహారాలు సాఫీగా జరిగిపోవడానికి తగిన నిధులు చేకూరాయి. 1942లో మౌర్వీ అతిథి గృహంలో రెండే ఇళ్ళు వుండేవి. ఇపుడు పెద్దవీ, చిన్నవీ కలిపి 40కి పైగా వసతి గృహాలు వున్నాయి. పల్లాకొత్తును ఆనుకొని వున్న కోతుల తోటలో కూడా ముప్పై మించి వసతి గృహాలు నిర్మింపబడ్డాయి.

శ్రీభగవాన్ సమాధి చుట్టూ ఎంతో అందమైన నల్లరాయితో ఒక చక్కటి కట్టడం నిర్మింపబడింది. సమాధి ఎదుట పూజా నిమిత్తం విశాలమైన హాలు 1970లో నిర్మింపబడింది. మొత్తం ఆశ్రమం చుట్టూ 7 లక్షల వ్యయంతో ఒక దిట్టమైన ప్రహరీ గోడ నిర్మింపబడింది. కొన్ని దశాబ్దాలుగా నాటిన మొక్కల వలన



ఆశ్రమం అంతా చక్కటి నీడను ఇచ్చే చెట్లతో వృక్ష సంపద పెరిగింది. ప్రభుత్వ అటవీశాఖ సహాయంతో, అరుణాచల పర్వత వాలులు అన్నీ చెట్లతో కళకళలాడుతున్నాయి.

శ్రీభగవాన్ జీవిత కాలంలోనే గోవు లక్ష్మి, మరికొన్ని దూడలు, ఎడ్లతో ఆశ్రమ పశుసంపద ఏర్పడింది. ఈ రోజు ఆశ్రమ గోశాలలో వందకు మించి పశువులు వున్నాయి. వంటశాల ఆధునీకరణలో ఆవిరి పొయ్యిలు, సౌరశక్తితో పని చేయు ఉపకరణాలూ, కొత్తగా వస్తున్న గోబర్ గ్యాస్ పొయ్యిలు ప్రవేశపెట్టబడ్డాయి.

భారతీయ భాషలలోనూ, విదేశీ భాషలలోనూ ఆశ్రమ సాహిత్యం విస్తృతంగా ప్రచురణ జరిగింది. ఆశ్రమ పుస్తకశాలను బాగా పెంచడం జరిగింది. ముందుకంటే 1990లో రెండు రెట్ల వైశాల్యం పెరిగింది. శ్రీరమణ గీతాలు ఇపుడు 50 కేసెట్లలో దొరుకుతాయి. 'శ్రీరమణ మహర్షి నూరవ సంవత్సర స్మారక గ్రంథాలయం' పేరుతో పెద్ద గ్రంథాలయం ఏర్పరచబడింది. మౌర్వీ అతిథి గృహ ప్రాంగణంలో కట్టబడిన రెండంతస్తుల భవనంలో ఈ గ్రంథాలయం నిర్వహించబడుతోంది. అనేక భాషలలో, అనేక విషయాలకు సంబంధించిన 30,000 పుస్తకాలు ఈ గ్రంథాలయంలో సేకరించబడ్డాయి.

శ్రీభగవాన్ జీవిత కాలంలోలాగానే బీదలకు అన్నదానం (నారాయణ సేవ) కొనసాగుతోంది. వందల కొద్దీ సాధువులు, బీదలు, ఆశ్రమ మధ్యాహ్న భోజన కాల సమయానికి ముందే, నారాయణ సేవలో పాల్గొని భోజనం చేస్తున్నారు. ఆశ్రమ

సందర్శకులకు కావలసిన కనీస సౌకర్యాలు, ఉచిత భోజన సదుపాయం నియమిత కాలానికి కల్పించబడుతున్నాయి. శ్రీభగవాన్ జయంతి, వర్థంతివంటి విశేష దినాలలో వేలకొద్ది ప్రజలకు భోజన సదుపాయం కల్పించబడుతోంది.

మా రెండవ అబ్బాయి గణేశన్ మంచి సాధకుడు. గత 30 ఏళ్ళుగా నాతోనే వుంటూ, అలసట అంటూ లేకుండా పనిచేస్తూ ఆశ్రమ నిర్వహణలో నాకు చేదోడువాదోడుగా వుంటున్నాడు. శ్రీభగవాన్ మహాసమాధి తర్వాత ఆశ్రమాన్ని వదలి వెళ్ళిన అనేకమంది భక్తులను వెనుకకు తీసుకువచ్చి, వారికి కావలసిన అవసరాలను కనిపెట్టుకుంటూ వుంటున్నాడు. వారిలో ఎవరైనా కాలం చేసినపుడు వారి అంత్యక్రియలు కూడా తానే నిర్వహిస్తున్నాడు. శ్రీభగవాన్ భక్తులతో అత్యంత సన్నిహితంగా మెలుగుతూ వారి ఆదరాభిమానాలను చూరగొన్నాడు. సమాధి స్థల నిర్మాణానికీ, దాని ముందున్న హాలు నిర్మాణానికి కావలసిన నిధుల సేకరణలో నాకు గట్టి తోడుగా నిలిచాడు. శ్రీభగవాన్ బోధనలను ప్రపంచ వ్యాప్తంగా ప్రచారం చేయటానికి విస్తృతంగా పర్యటిస్తూ వున్నాడు. మౌంటెన్‌పాత్‌తో సహా ఆశ్రమ ప్రచురణలన్నిటి బాధ్యతలూ తానే వహిస్తున్నాడు. శ్రీభగవాన్ జీవిత విశేషాలనూ, వారి బోధనలనూ శ్రీభగవాన్ భక్తుల జీవితాలలో విశేష సంఘటనలనూ అందరికీ తెలియపరచడంలో గణేశన్ అమితానందం అనుభవిస్తాడు. 1994లో గణేశన్ మౌంటెన్ పాత్ సంపాదకత్వానికి రాజీనామా చేసాడు.



మా మూడవ అబ్బాయి మణి, ఒక ప్రైవేటు కంపెనీలో ఇంజనీర్‌గా పని చేసేవాడు. సమయానికి ముందే పదవీ విరమణ చేసి వచ్చేసాడు. ప్రస్తుతం ఆశ్రమ యాజమాన్య వ్యవహారాలన్నీ తానే చూసుకుంటున్నాడు. ఆశ్రమ ప్రాంగణంలో చెట్లు నాటడం గురించీ, ఆశ్రమ గోశాల బాగోగులూ, ఆశ్రమ అతిథి గృహాల నిర్వహణ బాధ్యతలూ చూసుకుంటున్నాడు. ఆశ్రమ పనులలో పూర్తిగా నిమగ్నమైపోయి రోజుకు 15 గంటలు పని చేస్తాడు.

మా పెద్దబ్బాయి సుందర రమణన్ 1992లో ఒక ప్రభుత్వరంగ సంస్థ యొక్క ఉద్యోగ బాధ్యతల నుండి పదవీ విరమణ పొంది ఆశ్రమంలో స్థిరపడిపోయాడు. ప్రస్తుతం ఆశ్రమానికి మేనేజర్‌గా నాకు సహాయపడుతున్నాడు. ఆగష్టు 1994 నుండి ఆశ్రమ అధ్యక్షుడుగా బాధ్యతలు నిర్వహిస్తున్నాడు. ఆశ్రమ నిర్వహణకూ, ఆశ్రమాభివృద్ధికీ, దాని వివిధ శాఖలూ సమన్వయంతో పని చేయటానికి ఎంత కష్టపడినా, ఎంత చిత్తశుద్ధితో చేసినా కేవలం మానవ ప్రయత్నం చాలదు. శ్రీభగవాన్ దివ్యప్రకాశవంతమైన సన్నిధి, వారి కరుణాపూరిత సహాయం - ఎటువంటి క్లిష్టమైన సమస్యలు, ఇబ్బందులు ఎదురైనా, పరిష్కరించడానికి సరైన సమయంలో అనుకోని విధంగా లభించి మనల్ని కాపాడుతోంది. వారి దివ్యహస్తాలలో నేను ఒక పనిముట్టును మాత్రమే.

శ్రీభగవాన్ కరుణతో, అజ్ఞానం అనే అంధకారాన్ని పారద్రోలి, ఆత్మజ్ఞానంతో ఆనందమైన జీవితం గడుపుతూ ప్రపంచవ్యాప్తంగా అందరూ సుఖంగా వుందురు గాక! (సశేషం)

## శ్రీరమణ మహర్షి యొక్క భక్తాగ్రేసరులు

# సంపూర్ణమ్మ

**మల్లాది ఫణిమాల**

శ్రీ భగవాన్ జన్మించిన తిరుచ్చుళి గ్రామము యొక్క ప్రక్క గ్రామంలోనే సంపూర్ణమ్మగారు జన్మించారు. బాల రమణుల మృత్యు అనుభవం గురించి, తిరువణ్ణామలై వెళ్ళటము గురించి, ఆమె విని ఉన్నారు. కొంత కాలానికి సంపూర్ణమ్మ తన భర్తను కోల్పోయారు. దానివలన, ఆమె, అంతులేని దుఃఖంలోనూ, బాధలోనూ మునిగిపోయారు. ఆమె కుటుంబం వారు, శ్రీభగవానులు ఒక్కరే ఆమెను ఆ అంతులేని దుఃఖం నుండీ రక్షించ గలరని నమ్మి, ఆమెను శ్రీభగవాన్ దర్శనార్థం శ్రీరమణాశ్రమానికి రమ్మని ఆహ్వానించారు. కానీ అప్పుడు, ఆమెకు, ఎచటికీ వెళ్ళాలని అనిపించనందున, బంధువుల ఆహ్వానాన్ని తిరస్కరించారు.

ఒకరోజు ఆమె మధురైలోని మీనాక్షి ఆలయంలో ప్రార్థన చేస్తుండగా ఒక బ్రాహ్మణ బాలుడు ఆమెను సమీపించి, "మీరు నాకు భోజనం వండి పెట్టరూ" అని ఎంతో ఆప్యాయంగా అడిగాడు. ఎంత వింతైన కోరిక!! యాచించేటప్పుడు యాచకులు భోజనాన్నే యాచిస్తారు. కానీ ఈ బ్రాహ్మణ బాలుడు, "నాకు ఒకసారి భోజనం వండి పెట్టరా!" అని అడగటం, సంపూర్ణమ్మకు ఎంతో ఆశ్చర్యాన్ని కలిగించింది. సంపూర్ణమ్మ ప్రార్థన అప్పటికే దాదాపు పూర్తి అవ్వటంతో ఆమె తనలో తానే, "నాకు ఒక బ్రాహ్మణునికి వండి పెట్టే అవకాశం దొరికింది" అని అనుకుని ఎంతో సంతోషపడ్డారు. కానీ ఆ బాలుడు అంతలో, అంతర్థానమైపోవడాన్ని గమనించి, ఆమె విస్తుపోయారు. అతని కోసం మీనాక్షి దేవాలయంలో ఎంత వెదికినా, అతను ఆమెకు కనిపించలేదు. అప్పుడామెకు తట్టింది, ఆ వచ్చినది, తనను వెదుక్కుంటూ వచ్చిన శ్రీభగవానులే కానీ, వేరెవరో కాదు, అని.

కాబట్టి 1928లో ఆమె తన సోదరితోనూ, బావగారైన నారాయణ అయ్యర్‌తోనూ కలిసి, తిరువణ్ణామలై వెళ్ళారు. దుఃఖంలో ఉన్న సంపూర్ణమ్మ, శ్రీ భగవానుల ఒక్క చూపుతో శాంతిని పొందారు. శ్రీభగవానుల చూపు ఉపశమనం కలిగించేదిగా ఉన్నదని వారు గ్రహించారు. ఆమె భగవాన్ వైపు తదేకంగా చూస్తూ ఉండగా, భగవాన్ ఆమెపై దృష్టిని నిలిపారు. శ్రీభగవాన్ కృపా వీక్షణం యొక్క ఫలితం అద్భుతంగా ఉన్నది. ఆ ముగ్గురు ఇరవై రోజులపాటు శ్రీరమణాశ్రమంలోనే ఉండిపోయారు. అసలు ధ్యానం ఎలా చేయాలో తెలియని సంపూర్ణమ్మగారు, శ్రీభగవాన్ సన్నిధిలో కూర్చున్నప్పుడు అప్రయత్నంగా ధ్యానస్థితిలోనికి వెళ్ళిపోయేవారు. శ్రీభగవాన్ సన్నిధిలో ఉన్నప్పుడు, ఆమెలో ఏ ఆలోచనలూ ఉండేవికావు.

భగవాన్ సమక్షంలో అట్టి ఆలోచనా రహిత స్థితిని అనుభవించి నప్పుడల్లా ఆమె అనిర్వచనీయమైన శాంతిని పొందేవారు. ఇరవై రోజులు పూర్తై, సంపూర్ణమ్మ, తన గ్రామానికి తిరిగి వెళుతున్నప్పుడు, శ్రీ భగవాన్ ఆమెకు 'నేనెవరను' అనే పుస్తకాన్ని ఇచ్చారు.

సంపూర్ణమ్మ తన స్వగ్రామానికి చేరుకున్నాక, తన మనసు అలజడి చెంది యుండటాన్ని, ఆమె గమనించారు. శ్రీరమణాశ్రమములో ఉండగా తాను అనుభవించిన ప్రశాంతత, శ్రీ భగవానుల సాన్నిధ్యం వల్లనే అని ఆమె గ్రహించారు. ఆశ్రమానికి తిరిగి వెళ్ళే అవకాశం ఎప్పుడొస్తుందా అని ఎదురుచూస్తున్న సంపూర్ణమ్మగారిపై శ్రీ భగవానుల అనుగ్రహ వర్షం కురిసింది. ఆమె మేనమామ శ్రీరమణాశ్రమానికి వెళుతూ, సంపూర్ణమ్మను కూడా రమ్మని ఆహ్వానించారు. వారిరువురూ శ్రీరమణాశ్రమం చేరుకున్నారు. అక్కడ, వంటమనిషి శాంతమ్మాళ్ గారు వెళ్ళిపోతున్నట్లు తెలుసుకున్న సంపూర్ణమ్మగారిని శ్రీ భగవాన్ సన్నిధిలో, ఎవరో “శాంతమ్మాళ్ వెళ్ళిపోతున్నారు కాబట్టి, మీరు వంటపని చేపడతారా?” అని అడిగారు. సంపూర్ణమ్మకు, శ్రీరమణాశ్రమంలో, శ్రీ భగవానులను సేవించుకొనుటకు ఇంతకంటే మించిన సదవకాశమేమున్నదని అనిపించింది. ఆమె ఎంతో ఆనందంతో వంట పని ప్రారంభించారు. రోజు వంట చేసి, భగవాన్‌కు వడ్డన చేస్తున్నప్పుడు, మధురమీనాక్షి ఆలయంలో, “నాకు ఒకసారి భోజనం వండి పెడతారా” అని అడిగిన బ్రాహ్మణ బాలుడు ఆయనేనని ఆమె గుర్తించారు.

సంపూర్ణమ్మ వంట వండే పద్ధతికీ, శ్రీరమణాశ్రమంలో వంట వండే విధానానికి ఎంతో తేడా ఉన్నదని ఆమె గ్రహించారు. ఆమెకు వంట చేతనయినప్పటికీ, శ్రీభగవానులు ఆమెకు వండటంలో మెళకువలు, స్వల్పమైన తేడాలను గుర్తించి, రుచికరంగా భోజన



పదార్థాలను ఎలా తయారు చేయ్యాలో నేర్పించారు. ఎన్నో రకాలుగా పప్పులతోనూ, ధాన్యములతోనూ, కూరగాయలతోనూ, రుచికరమైన వంటకాలను ఎలా తయారు చెయ్యాలో ఆమెకు నేర్పారు. అంతేకాకుండా, వంటశాలలో వంటకి సంబంధించిన సూచనలు ఇస్తూ, శ్రీభగవాన్ ఎన్నో మంచి కథలు కూడా చెప్పేవారు. శ్రీ భగవాన్, వారి బాల్యానికి సంబంధించిన కథలతో ప్రారంభించి, మెల్లగా వేదాంతం గురించి చెప్పి, ఆత్మబోధతో ముగించేవారు. వంటశాలలో వండిన అన్ని పదార్థాలను శ్రీభగవానులే రుచి చూసేవారు. కావున అందరూ తినకముందే, ఆహారాన్ని పరమేశ్వరునికి అర్పించిన ఫలితం దక్కేది. సంపూర్ణమ్మ వంట, తల్లి అళఘమ్మ వంటను గుర్తు చేయుచున్నదని, భగవాన్ ఎంతో ఆప్యాయంగా అనడం, సంపూర్ణమ్మకు చెప్పలేనంత ఆనందం కలిగించేది. సంపూర్ణమ్మ తిరిగి తన స్వగ్రామానికి వెళ్ళే ప్రస్తావన వచ్చినప్పుడల్లా, “అయ్యో! ఆశ్రమంలో ఎంతో చక్కగా వంటచేసే ఈమె వెళ్ళిపోవాలనుకుంటున్నారు. ఎలా మరి!!” అని విచారంగా అనేవారు. శ్రీరమణులు. కేవలం శ్రీ రమణుల సన్నిధి ద్వారానే, సంపూర్ణమ్మగారికి మరియు ఆమెతో వంటశాలలో పనిచేయు వారందరికీ, సాక్షాత్తు పరమేశ్వరుని సన్నిధానంలో ఉన్నట్లు మరియు వారు చేసిన పని అంతయూ కూడా పరమేశ్వరుని సేవయేనని, వారంతా అర్థం చేసుకునేటట్లు శ్రీరమణులు చేసేవారని, సంపూర్ణమ్మ తరచు అనేవారు.

శ్రీరమణులు సంపూర్ణమ్మకు మరియు వంటశాలలో వారికీ రుచికరంగా వండటం నేర్పే విధానాన్ని చూచి, ఆశ్రమానికి కొత్తగా వచ్చినవారు శ్రీరమణులు భోజనప్రియులనీ, సుష్టుగా భోజనం చేస్తారనీ, పొరపాటుగా అభిప్రాయపడేందుకు అవకాశముండేది. దానికి వ్యతిరేకంగా, భగవాన్ వారి విస్తర్లో, భోజన పదార్థాలను స్వల్పంగా వడ్డించమని ఆదేశించగా, సంపూర్ణమ్మ మరియు ఆమె తోటివారు, ఒకరోజు, శ్రీరమణులను సమీపించి, “మీరు స్వల్పంగా తినటమే కాకుండా, తీపి, పులుపు, కారం - ఈ పదార్థాలన్నిటినీ ఏకం చేసి రుచి గురించి బొత్తిగా పట్టించుకోకుండా అలా తింటే ఎలా భగవాన్!” అని అడిగారు. వారి ప్రశ్నకు సమాధానంగా భగవాన్, “భిన్నత్వం చాలు! ఏకత్వం ఉండనివ్వండి” అని నవ్వుతూ జవాబిచ్చారు.

ఒకరోజు శ్రీరమణులు, సంపూర్ణమ్మకు ఋభుగీతను ఇచ్చి చదవమని ఆదేశించారు. “పండితుల చేత మాత్రమే చదవబడే ఈ గ్రంథం నేను చదివి, అర్థం చేసుకోలేక పోతున్నానని, ఆమె రమణులకు విన్నవించుకోగా, వారు ఇలా అన్నారు.

“అర్థమయినా, కాకపోయినా, నీవు ఈ పుస్తకాన్ని ప్రతీరోజు చదవటం అలవాటు చేసుకుంటే, ఆధ్యాత్మికంగా, దాని వలన నీకు ఎంతో లాభం కలుగును”.

భగవాన్, వారి భక్తుల విషయంలో ఎంత శ్రద్ధ వహిస్తారో తెలియజేయుటకు ఇంతకంటే ఉదాహరణ ఏముంటుంది కనుకని!



సంపూర్ణమ్మగారు చెప్పిన రెండు అందమైన జ్ఞాపకాలు ఇచ్చట ఇవ్వబడినవి.

ఒకసారి వైద్యులు, శ్రీభగవాన్‌కు, మజ్జిగకు బదులుగా పెరుగు తీసుకోమని చెప్పారు. కానీ, అందరికీ సరిపడ పెరుగు లేదు. భగవాన్ తమకు ప్రత్యేకంగా ఏమైనా వడ్డిస్తే తినరు. ఒకరోజు శ్రీ భగవానులకు మజ్జిగ వడ్డిస్తున్న సుబ్బలక్ష్మి అమ్మాళ్, మజ్జిగ పాత్రలో రహస్యంగా ఒక గరిట నిండా పెరుగు ఉంచి, అది శ్రీభగవానులకు వడ్డించారు. భగవాన్ ఆమె వైపు తేరిపార చూసి, “సుబ్బలక్ష్మీ! మీరు ఏమి చేశారో తెలుసా? మీరు నాకు విషాన్ని వడ్డించారు. నాకు భక్తులకు మధ్య ఏ విధమైన వ్యత్యాసాన్నైనా చూపించటం విషంతో సమానం” అని అన్నారు. భక్తులంటే శ్రీరమణులకు ఎంత ప్రేమో మనం సంపూర్ణమ్మగారు వివరించిన ఈ సంఘటనను చదివితే అర్థమౌతుంది.

రెండవ సంఘటన కూడా అపూర్వమైనదే. సంపూర్ణమ్మ ఇలా చెప్పారు, “ఒకసారి నేను కొందరు స్నేహితులతో కలిసి కాశీ యాత్రకు వెళ్ళడానికి శ్రీభగవానుల అనుమతి కోరాను. భగవాన్ ఎగతాళిగా అడిగారు, “మీరు కాశీలో అరుణాచలంలో లేనిది ఏమి ఉంటుందని భావిస్తున్నారు” అని అడిగారు? కాశీ విశ్వేశ్వరుడు ఇక్కడే ఉన్నాడు. ఆయన ఇక్కడే మీ దగ్గరే ఉంటే, ఆయనను వెతుక్కుంటూ మీరు ఎక్కడికో వెళ్ళటం ఎందుకు?” భగవాన్ అనుమతి ఇవ్వలేదు కనుక నేను యాత్ర ప్రసక్తిని వదిలివేశాను. కానీ సద్గురు రమణుల కరుణను ఏమని వర్ణించగలను?

మరునాడు ఉదయాన్నే భగవాన్ నాతో ఇలా అన్నారు, "సంపూర్ణమ్మా! నాకు రాత్రి ఒక కల వచ్చింది. మీరు కాశీలో విశ్వనాథుని ఆలయంలో పూజా కైంకర్యం చేస్తున్నట్లు", "నాకు ఆశ్చర్యము, అది కలేనా!!?" అని. శ్రీరమణులు నన్ను తీసుకుని వెళ్ళి, ఆలయంలో పూజ చేసుకునే భాగ్యాన్ని కూడా అనుగ్రహించి, తిరిగి అరుణాచలం తీసుకుని వచ్చారా!" అని నేను అనుకున్నాను.

శ్రీ భగవానులు సంపూర్ణమ్మ పట్ల చాలా కరుణతో ఉండేవారు. ఆమెను లౌకిక స్థితి నుండి పరిపూర్ణమైన ఆధ్యాత్మిక స్థితికి లేవనెత్తారు, శ్రీరమణులు. సంపూర్ణమ్మగారు, శ్రీ భగవాన్ ఆరాధన రోజున, శ్రీరమణాశ్రమములోనే కన్నుమూశారు. శ్రీరమణులకు మరియు వారి భక్తులకు జీవితాంతం వంటవండి పెట్టి, వారిని కనిపెట్టుకుని ఉన్నందుకు, శ్రీరమణులు, సంపూర్ణమ్మకు శివైక్యాన్ని అనుగ్రహించారు.

**జలమయ తీర్థములు, మృణ్మయ, శిలామయ (మట్టి, రాతి) దేవతలు కాలాంతరంలో పావనం గావింపగలవు. సాధువులైతే దర్శన మాత్రం చేత పునీతులను చేయుదురు.**

ఉన్నది నలుబది -- అనుబంధం : 5వ శ్లోకము



# శ్రీరమణ మహర్షి సూక్తులు

కమలాకర వేంకట రావు

**ఈశ్వరతత్వం**

జీవుడు, ఈశ్వరుడు, బంధము - ఈ మాదిరి త్రిపుటులు ప్రతి మతంలోనూ ఉన్నాయి. మనస్సు పని చేస్తున్నంత కాలం యివి యథార్థములే. ఇవి కేవలం మనః కల్పితములు. ఈశ్వరుని ప్రతిపాదించేది మనస్సు. వాస్తవానికి ఈశ్వరుడు ఆత్మ కంటె వేఱు కాదు. ఆత్మయే ఈశ్వరుడుగా విషయీభూతమవుతున్నది. గురువు విషయంలో కూడ యింతే.

**ఈశ్వరుడు**

జగత్తుతో సంబంధాన్ని పురస్కరించుకొని బ్రహ్మమును ఈశ్వరుడని పేర్కొన్నారు. మనం ఒండొరులతో మాట్లాడుకున్నట్లే, ఈశ్వరునితో కూడ మాట్లాడవచ్చు. అయితే, అందుకు మనశ్శుద్ధి, మనోబలం, ధ్యాననిష్ఠ అవసరం.

**ఉత్తమోత్తమ దీక్ష**

మౌనంతో యిచ్చే దీక్షే దీక్షలలో కెల్ల ఉత్తమమైనది. ఇది శ్రీ దక్షిణామూర్తి అనుగ్రహించినది. స్పర్శ, దృష్టి మొదలైన వాటి ద్వారా యిచ్చేవి దానికంటె తక్కువ రకానికి చెందినవి. మౌనదీక్ష సకల హృదయాలలోను మార్పు తెస్తుంది.

## ఉపవాస ప్రయోజనం

ఉపవాసం మంచిదే. కాని, అదే పరమలక్ష్యం కారాదు. దానితో పాటు ఆధ్యాత్మికాభివృద్ధి యందు కూడ శ్రద్ధ వహించాలి. కటిక ఉపవాసం మనస్సును దుర్బల పరుస్తుంది. ఆధ్యాత్మికాన్వేషణకు కావలసిన శక్తి నీవు పొందలేకపోతావు. కనుక, మితాహారం గైకొంటూ నీ అభ్యాసం కొనసాగించు.

## ఎదురు ప్రశ్న

భగవంతునియందు భక్తి కలిగి వుండుమని చెప్పడం తోటే తృప్తిపడి వెళ్ళిపోయేవాడయితే సరే. అలా కాక, ఒక్కొక్కప్పుడు ఎదురుతిరిగి, 'భగవంతుడు, నేను' అని ఇక్కడ ఇద్దరం ఉంటున్నాము కదా, ఎక్కడో ఉన్న భగవంతునికంటే అత్యంత సన్నిహితమైన నేనెవరో ముందు తెలుసుకోడం అవసరం కాదా? అని ప్రశ్నిస్తారు. అట్టి వారికే విచారమార్గం బోధించాలి. వస్తుతః భక్తికీ విచారానికీ భేదం లేదు.

## ఎరుక అత్యంత ముఖ్యం

చిత్తవృత్తులు నిరోధించేటప్పుడు ఎరుక గలిగి ఉండడం అత్యంత ముఖ్యం. లేనియెడల అది నిద్రలోకి దారితీస్తుంది. ప్రాణాయామం తరువాత ప్రత్యాహారం, ధారణ, ధ్యానం, సమాధి అనే వాటిని పతంజలి నిర్దేశించడంలో యీ యెరుక ముఖ్యమనేదే సూచిత మవుతున్నది. ప్రాణాయామం వల్ల వృత్తులు విరుద్ధములై మనస్సు నిశ్చలమతుంది. 'క్లోరోఫారం' మొదలైన వాటివల్ల కూడా



పై స్థితుల వంటివి కలుగవచ్చు. కాని, యెరుక లేకపోవడం వల్ల అవి మోక్షప్రదం కానేరవు.

## ఏకాంతవాసం

మనస్సును నిశ్చల మొనర్చుకోడమే ఏకాంతవాసం. విజన స్థలానికి పోవడం కాదు. జనం మధ్యలో ఉండి కూడా మనస్సును నిశ్చల మొనర్చుకోవచ్చు. విజన స్థలంలో ఉన్నంత మాత్రాన మనస్సు నిశ్చలం కాదు. అభ్యాసం వలన మాత్రమే నిశ్చలమవు తుంది. విజన స్థలంలో ఉన్నప్పుడు కూడా ఏకాంతానికి ఎక్కడ భంగం వాటిల్లుతుందో నన్న భయం ఉంటుంది. పైగా, ఎక్కడ ఉన్నప్పటికీ అభ్యాసం తప్పదు.

## కర్తృత్వ భారం

రైలుబండిలో ప్రయాణం చేసేవాడు తన నెత్తిమీద బరువు దించుకోకపోతే అది అతని తప్పే అవుతుంది. అతడా బరువు దించి వేసుకోడం అవసరం. అతనితోపాటు ఆ దించిన సరుకు కూడా తుదకు గమ్యం చేరి తీరుతుంది. అట్లే ఈ జగత్తులో మనం కర్తృత్వ భారం తలనిడికోరాదు. జగన్నియంతపై ఆ భారం వదిలి కూర్చోడం మంచిది.

## కర్మఫల ప్రదాత

కర్మకు ఫలం ఉన్నది. ఒకటి కారణం, రెండవది కార్యం. రెండిటికీ గల సంబంధం ఒకానొక శక్తి ఫలితం. దానినే దైవమని పిలుస్తాము. దైవం కర్మఫల ప్రదాత.

### కర్మయోగం

తాను కర్త ననుకోకుండ కర్మ చేయడమనేదే కర్మయోగం. కర్తృత్వ బుద్ధిలేకపోయినా కర్మలు వాటంతటవే జరిగిపోతాయి. ప్రతివాడూ ఏదో ఒక ప్రయోజనం నిమిత్తం జన్మ యెత్తుతున్నాడు. తాను కర్తనని అనుకున్నా అనుకోకపోయినా ఆ ప్రయోజనం కొనసాగితీరుతుంది.

### కామప్రవృత్తి నిర్మూలన

కామప్రవృత్తిని నిర్మూలం చెయ్యాలంటే, దేహమే నేననే భావాన్ని నిర్మూలం చెయ్యాలి. దేహమే నీవని అనుకుంటున్నందు వల్ల నే యింకొకరిని కూడా దేహంగా చూస్తున్నావు. లింగభేద భావం అందువల్ల ఉత్పన్నమౌతున్నది. నీవు దేహాతిరిక్తమైన ఆత్మవని తెలుసుకో. ఆత్మకు లింగభేదం లేదు. అందుచే కామప్రవృత్తి నిన్ను బాధించదు.

### కామవినాశనం

స్త్రీ, పుం విభేదదృష్టి నశించినప్పుడే కామప్రవృత్తి నశిస్తుంది. స్త్రీ పురుషుల పరస్పర సంబంధం మనోభావానికి సంబంధించినది. ఆత్మ ప్రియమైనందువల్లనే ఏ ఇతరులైనా ప్రియులౌతున్నారని ఉపనిషత్తు చెపుతున్నది. ఆనందం మనసులోనే ఉన్నదిగాని బయట లేదు. ఆత్మ ప్రేమయే ప్రేమ. అది వెలుపల గాక లోపల ఉన్నది అని తెలుసుకుంటే భేదదృష్టి అంతరిస్తుంది.



## శ్రీరమణ మానసము

బిరుదువోలు లక్ష్మమ్మ

10. కం. పలురీతుల విషయేచ్ఛలు
చెలరేగుచు నన్ను మిగుల చింతను ముంచెన్
వలదిక నీ సాంగత్యము
తలపుల రమణేశు జేర్తు తథ్యము మనసా ॥

11. కం. మాటికి వేడిన సూటిగ
నేటికి కనుపించ డమ్మ నేనేమందున్
మాటలలో మరచితివో
ఏటికి నిర్దయుడు నగును? యెంచవె మనసా ॥

12. కం. ఉన్నది తానుగ తానొక
డెన్నొ విధంబులను గురుడు హితమున్ దెలిపెన్
కన్నై తా నీ మూలము
చెన్నుగ రమణుండు చూడ జేయునె మనసా ॥

13. కం. ఉండును పోవును నిట్టిది
దండుగ లోకంబు జూడ దార్కొను భయమున్
నిండగు నీ భ్రమయంతయు
చెండుము, నీదరి రమణుడు చెలగున్ మనసా ॥

14. కం. చెప్పక చెప్పెడు తత్త్వము
నెప్పగిది నెఱుంగ నేర్తు నెటుసాధింతున్
ఎప్పుడు మార్గం బిట్టిది
అప్పని దయనా నాకెటు ఫల మబ్బును మనసా ॥

# Inside the Jaws of the Tiger

(Talk 80)

Dr.K.Subrahmanian

When your child or grandchild has learnt a poem, and wants to show off her knowledge, she may ask you, "Do you know this poem?" In order to encourage the child, you say, "No, I don't know the poem. Please recite it for me." The child is very happy that she knows what you don't, and with great pride, she recites the poem. After the recitation, she may once again ask, "You don't know this poem?" When you again say that you don't, the child is very happy that she knows something that you don't. She may excitedly tell other people about this, and you are very happy. You do this for the simple reason that you want to make the child happy. In other words, you pretend that you do not know, and the child is very happy that she knows what you don't. She also has the feeling that now she has recited it, you know all about the poem.

We do so many things for the people we love - something that we don't for others. Very often, when we are in despair or in depression, we appeal to our *guru* or God: "Can't you see how much I am suffering? Can't you do something about it? You must open your eyes and see what is happening." If he is a living *guru*, he wouldn't say, "I know what is happening." Instead, he would say, "Is that so?" and ask you a number of questions. We have the feeling that he does not know, and so, we pour our



heart out to him. He doesn't say anything; he merely listens. When the *guru* does not say anything, we are hurt. We think, "What is this? I said so much about my problems. But he didn't say he will do something about it." We then begin to doubt whether the *guru* can do anything at all. Sometimes, we feel the *guru* is a myth because we wonder how it is possible for another person to do something for us when we are deeply distressed. After sometime, we tell other people how we went to our *guru* with a problem, but he did not say or do anything. We tell people that it is pointless to go to a *guru*, and we have to do something ourselves.

This is human nature - we think the *guru* does not know what is going on. We are like the child who feels that the father or the grandfather does not know the poem. Suddenly, when we least expect it, we get some peace in the midst of our problems. Because of our limitations, we do not realize that the peace we get for some time is the result of the grace of our *guru*. Even though we are in the company of the *guru*, the problems may or may not get solved. But we constantly think about what the *guru* can do or cannot do. In all this, without our knowledge, we think of our *guru*. And very rarely, we realize that it is the *guru* who makes us think of him.

